ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



మంచిర్యాల
జిల్లా వార్తలు

5

శనివారం 2 మార్చి 2024

మొక్కల సంరక్షణ అందరి బాధ్యత

మందమర్రిరూరల్, మార్చి 1 : మొక్కల సంరక్షణ అందరి బాధ్యత అని ఎంపీడీవో రాజేశ్వర్ పేర్కొన్నారు. శుక్రవారం శంకర్‌పల్లిలో నర్సరీలను, ఉపాధిహామీ పనులను పరిశీలించి మొక్కలకు నీరు పోశారు. ఆయన మాట్లాడుతూ వేసవిలో మొక్కలను సంరక్షించేందుకు సమృద్ధిగా నీరు పోయాలన్నారు. ఉపాధిహామీ కూలీలు పనులకు ఎక్కువ మంది హాజరయ్యేలా చూడాలని సూచించారు. వేసవిలో ఉదయం 7 నుంచి 10 గంటల వరకు కూలీలు పనులు ముగించుకోవాలని పేర్కొన్నారు. ఎంపీవో బీరయ్య, ఈసీ రఘు, కార్యదర్శి , ఉపాధి సిబ్బంది ఉన్నారు.

జోడువాగుల వద్ద బ్రిడ్జి నిర్మించాలి



బ్రిడ్జి వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

చెన్నూరు, మార్చి 1: చెన్నూరు నుంచి మంచిర్యాలకు వెళ్లే ప్రధాన రహదారి జోడువాగుల వద్ద బ్రిడ్జి, రోడ్డు నిర్మించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బోడెంకి చందు పేర్కొన్నారు. శుక్రవారం బ్రిడ్జి వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రధాన రహదారి కావడంతో రోజు వందలాది వాహనాలు వేలాది మంది ప్రయాణికులు వెళ్తున్నారన్నారు. బ్రిడ్జి ఇరుకుగా ఉండి శిథిలావస్థకు చేరుకుందని, రోడ్డు గుంతలమయంగా మారిందని, ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఎమ్మెల్యే జోక్యం చేసుకుని వెంటనే బ్రిడ్జి, రోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరారు. నాగేష్‌కుమార్, సత్తన్న, ఉమారాణి, సమ్మక్క, నాగజ్యోతి, యామిని, సరిత లింగన్న పాల్గొన్నారు.

రైతులు లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేయాలి



భీమిని, మార్చి 1: వరి పంటలో ప్రతీ రైతు లింగాకర్షక బుట్ట లు ఏర్పాటు చేసుకోవా లని ఏఈవో వినోద్ కుమార్ అన్నారు. శుక్ర వారం మండల కేం ద్రంలో వరి పంటలను పరిశీలించారు. లింగాకర్షక బుట్టల వలన కాండం తొలుచు పురుగులు, రెక్కల పురుగుల ఉధృతిని తగ్గించవచ్చన్నారు. ఈ బుట్టలు ఎకరానికి 15 చొప్పున ఏర్పాటు చేసుకోవాలన్నారు. రైతులకు పలు సలహాలు అందించారు.

పాఠశాలలకు కుర్చీలు, ఫ్యాన్‌లు అందజేత



కుందారం పాఠశాలలో అందజేస్తున్న డివిజనల్ మేనేజర్

జైపూర్/భీమారం, మార్చి 1: ముదికుంట, కుందారం, భీమారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు అటవీ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం కుర్చీలు, ఫ్యాన్‌లు అందజేశారు. సంస్థ డివిజనల్ మేనేజర్ శ్రీశ్రావణి మాట్లాడుతూ సామాజిక సేవా కార్యక్రమం కింద పాఠశాలలకు కావాల్సిన కనీస సౌకర్యాల కల్పనలో భాగంగా అటవీ అభివృద్ధి సంస్థ కృషి చేస్తుందన్నారు. సంస్థ ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామన్నారు. ప్లాంటేషన్ మేనేజర్‌లు సురేష్‌కుమార్, లక్ష్మణ్, సునీత, జూనియర్ అసిస్టెంట్ రవికుమార్, సూపర్‌వైజర్ రాజేష్, వాచర్‌లు శంకర్, సాయికిరణ్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భూకబ్జాపై న్యాయం చేయాలి



తహసీల్దార్ కార్యాలయం ఎదుట బాధితులు

చెన్నూరు, మార్చి 1: బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి గోపినాథ్, పీవోడబ్ల్యూ జిల్లా నాయకురాలు భవానీ, శిరీషలు ఆందోళన చేశారు. పట్టణానికి చెందిన పెద్దకొండ లక్ష్మీరాజంకు చెందిన పట్టా భూమిని రేవెల్లి పోశం కబ్జా చేసినప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని వాపోయారు. బాధితుడు లక్ష్మీరాజంకు అన్ని ధ్రువీకరణ పత్రాలు ఉన్నప్పటికీ కబ్జాదారులపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. కౌన్సిలర్ రేవెల్లి మహేష్ తహసీల్దార్ కార్యాలయంలోని రికార్డు అసిస్టెంట్ మురళితో కుమ్మక్కై రికార్డులు తారుమారు చేసే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బాధితుడు లక్ష్మీరాజంకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

సృజనాత్మకతను వెలికితీసేందుకే వైజ్ఞానిక ప్రదర్శనలు



ప్రదర్శనలు వీక్షిస్తున్న డీఈవో యాదయ్య

మందమర్రిటౌన్, మార్చి 1: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయడానికి వైజ్ఞానిక ప్రదర్శనలు ఎంతగానో ఉపయోగపడతాయని డీఈవో యాదయ్య పేర్కొన్నారు. శుక్రవారం మదర్ థెరిస్సా పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సం సందర్భంగా వైజ్ఞానిక ప్రదర్శనకు ఆయన హాజరై ప్రదర్శనలను వీక్షించారు. ఆయన మాట్లాడుతూ సమాజానికి ఉపయోగపడే పరికరాలను విద్యార్థులు తయారు చేయాలని సూచించారు. ప్రజలను పట్టి పీడిస్తున్న కాలుష్యాన్ని తరిమికొట్టే పరికరాలను రూపొందించాలన్నారు. ఉత్తమ ప్రదర్శనలు తయారు చేసిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందించారు. ఎంఈవో పోచయ్య, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, రాంపాల్‌రెడ్డి, నిర్వాహకులు భువనేశ్వరి పాల్గొన్నారు.

విద్యారంగంపై ప్రభుత్వం చిన్నచూపు

మంచిర్యాల కలెక్టరేట్, మార్చి 1: విద్యారంగంపై ప్రభుత్వం చిన్న చూపు చూస్తుందని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీకాంత్, డీటీఎఫ్ జిల్లా కార్యదర్శి జయకృష్ణలు పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని మార్క్స్ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం విద్యకు కనీస బడ్జెట్ కేటాయించకుండా నిర్లక్ష్యం చేసిందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో స్కావెంజర్లు లేక విద్యార్థులే పనులు చేస్తున్నారన్నారు. అనుమతులు లేకుండా నడుస్తున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా విద్యారంగాన్ని బలోపేతం చేయాలని కోరారు నాయకులు రెడ్డి చరణ్, రాహుల్, జతిక్, లక్ష్మణ్, శ్రీనివాస్, వంశీ, ప్రవీణ్, రాజేష్, క్రాంతి,గోపాల్,అభి తదితరులు పాల్గొన్నారు.

గ్యారెంటీ పథకాలు అందేదెలా..?



- ఉచిత విద్యుత్, రూ. 500 గ్యాస్‌కు రేషన్‌కార్డు తప్పనిసరి
- 8 ఏండ్లుగా ఇవ్వని కొత్త రేషన్ కార్డులు
- జిల్లాలో కార్డు కోసం 30 వేల మంది ఎదురుచూపులు

బెల్లంపల్లి, మార్చి 1: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న ఆరు గ్యారంటీ పథకాలు పొందేందుకు రేషన్ కార్డు తప్పనిసరి కావడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో ఆరు గ్యారంటీ పథకాలకు అర్హులైన వేల మంది ఆశగా చూస్తున్నారు. ఆధార్‌కార్డ్‌తో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం సౌకర్యాన్ని కల్పించింది. ఇతర గ్యారంటీ పథకాల కోసం రేషన్ కార్డు నిబంధన తప్పనిసరి చేయడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులను జారీ చేయలేదు. రేషన్ కార్డు కోసం జిల్లాలో వేల మంది దరఖాస్తు చేసుకుని నిరీక్షిస్తున్నారు.

గ్యారంటీల కోసం ఆందోళన

జిల్లా వ్యాప్తంగా 27,205 మంది రేషన్ కార్డు కోసం ఎదురు చూస్తున్నారు. అలాగే వీరే కాకుండా కొత్తగా వివాహమైన వారు, జీవనోపాధి కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారు కొత్త రేషన్ కార్డులకు నోచుకోలేదు. ప్రస్తుతం ప్రభుత్వం ఆరు గ్యారంటీ పథకాలకు రేషన్ కార్డు తప్పనిసరి చేయడంతో ప్రజల్లో ఆందోళన నెలకొంది. ఆరు గ్యారంటీ పథకాల్లో భాగంగా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణానికి రేషన్ కార్డు నిబంధన పెట్టలేదు. ఆరోగ్యశ్రీ పరిమితి రూ.10 లక్షలు పెంచే పథకానికి మాత్రం రేషన్ కార్డు తప్పనిసరి చేసింది. ఇటీవల మరో రెండు గ్యారంటీ పథకాలను ప్రభుత్వం అమలు చేసేందుకు సంబంధిత శాఖలకు ఆదే శాలు జారీ చేసింది. ప్రస్తుతం ఈ ప్రక్రియ జిల్లా వ్యాప్తంగా కొనసాగు తుంది. రూ.500లకు గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకాలకు ప్రభు త్వం రేషన్ కార్డులను ప్రామాణికంగా తీసుకుంది. దీంతో రేషన్ కార్డులు లేని వారు ఇబ్బందులు పడుతున్నారు. ప్రజాపాలనలో భాగంగా ఆరు గ్యారంటీ పథకాల కోసం రేషన్‌కార్డులు లేని వారు రేషన్ కార్డులకు కూడా దరఖాస్తులు చేసుకోవాలని ప్రభుత్వం సూచించడంతో దరఖాస్తులు స్వీకరించారు. కానీ కొత్త రేషన్ కార్డుల కోసం ఎలాంటి విధి విధానాలను ప్రభుత్వం ప్రకటించకపోవడం, గ్యారంటీ పథకాలకు రేషన్ కార్డు తప్పనిసరి చేయడంతో ప్రజల్లో ఆందోళన నెలకొంది. కొత్త రేషన్ కార్డులు ఇవ్వకుండా ఆరు గ్యారంటీలను అమలు చేస్తుండడం, గ్యారంటీ పథకాలకు రేషన్‌కార్డు తప్పనిసరి చేయడంతో అర్హులకు అందకుండా పోతుందని ఆందోళన చెందుతున్నారు.

2016లో రేషన్ కార్డులను అప్పటి ప్రభుత్వం జారీ చేసింది. ఆ తర్వాత నూతన రేషన్ కార్డులను జారీ చేయలేదు. అలాగే కొత్తగా వివాహం అయిన వారు సైతం రేషన్ కార్డులకు నోచుకోలేదు. ప్రస్తుతం జిల్లాలో 2,14,236 మందికి రేషన్ కార్డులు ఉన్నాయి. ఇందులో అంత్యోదయ కార్డులు కలిగిన వారు 15,417 మంది ఉండగా, ఆహార భద్రత కార్డులు 1,98,649, అన్నపూర్ణ కార్డులు 170 ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలో పలుమార్లు కొత్త రేషన్ కార్డుల ప్రకటన జారీ చేయడంతో జిల్లా వ్యాప్తంగా వేల మంది దరఖాస్తులు చేసుకున్నారు. బెల్లంపల్లి

రేషన్ కార్డుల కోసం ఎదురుచూపులు

మండలంలో 2,620 మంది, భీమిని మండలంలో 488, కన్నెపల్లిలో 477, కాసిపేటలో 1249, తాండూర్‌లో 991, వేమనపల్లిలో 363, నెన్నెలలో 574, భీమారంలో 418, చెన్నూరులో 2966, దండేపల్లిలో 1382, హాజీపూర్‌లో 892, జైపూర్‌లో 1256, జన్నారంలో 1631, కోటపల్లిలో 959, లక్సెట్టిపేటలో 1360, మంచిర్యాలలో 3115, మందమర్రిలో 3581, నస్పూర్‌లో 2884 మంది రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు చేసుకున్నారు. వీరికి ఇప్పటి వరకు రేషన్ కార్డులు జారీ కాలేదు.

రేషన్‌కార్డు లేక నష్టపోతున్నాం: సుమలత

రేషన్ కార్డు కోసం గతంలో దరఖాస్తు చేసుకున్నా. ఇప్పటి వరకు కార్డు రాలేదు. రూ. 500లకు గ్యాస్ సిలిండర్, ఉచిత విద్యుత్ రావాలంటే అధికారులు రేషన్ కార్డు తప్పనిసరి అంటున్నారు. ఈ పథకాలకు నాకు అర్హత ఉన్నప్పటికీ రేషన్ కార్డు లేకపోవడంతో నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం రేషన్ కార్డులను మంజూరు చేయాలి.

రేషన్ కార్డులను అందించాలి: నాగేష్

గత ప్రభుత్వ హయాంలో రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకున్నా ఇవ్వలేదు. ఈ ప్రభుత్వం అర్హులైన వారందరికి రేషన్ కార్డులను వెంటనే అందించిన తర్వాతనే గ్యారంటీ పథకాలను అమలు చేయాలి. లేదా రేషన్ కార్డు సంబంధం లేకుండా పథకాలను అమలు చేయాలి. అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందించేందుకు ప్రభుత్వం చొరవ చూపాలి.

క్షేత్రస్థాయిలో భూ సమస్యల పరిష్కారానికి కృషి

మంచిర్యాల కలెక్టరేట్, మార్చి 1: ధరణిలో నమోదైన దరఖాస్తులపై క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ జరిపి పరిష్కరించేందుకు ఈ నెల 9వ తేదీ వరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తామని కలెక్టర్ బదావత్ సంతోష్ పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్, బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణతో కలిసి తహసీల్దార్‌లు, డిప్యూటీ తహసీల్దార్, రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ధరణిలో నమోదైన భూ సమస్యలను పరిష్కరించేందుకు ఈనెల 9వ తేదీ వరకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తామని, మండల అధికారులు తమ పరిధిలో నమోదైన భూ సంబంధిత దరఖాస్తులు, ఫిర్యాదులపై క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ జరిపి పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. ఆర్డీవో పరిధిలో పాస్ పుస్తకం లేకుండా నాలా దరఖాస్తు, భూముల సంబంధిత ఫిర్యాదులు, ఎన్‌ఆర్ఐ పోర్టల్, సంస్థల కోసం పట్టాదారు పాసు పుస్తకం, కోర్టు కేసుల సమాచారం, పట్టాదారు పాసు పుస్తకంలో ఖాతా, పేరు మిస్సింగ్, సర్వే నెంబరు, భూ రకం, విస్తీర్ణం భూవినియోగం ఇతరత్రా వివరాల సవరణ అంశాలు ఉంటాయని తెలిపారు. తహసీల్దార్ పరిధిలో



మాట్లాడుతున్న కలెక్టర్ బదావత్ సంతోష్

అసైన్డ్ భూముల వారసత్వం, జీపీఏ, ఎస్‌పీఏ దరఖాస్తులు, ఆధార్ వివరాలు సక్రమంగా లేని నిర్దిష్ట భూ విషయాలపై దరఖాస్తు, ఖాతా కలిపే అంశాలు ఉంటాయని తెలిపారు. న్యాయస్థానం తీర్పు ద్వారా పట్టాదారు పాసు పుస్తకం జారీ, నిషేధిత భూముల ఫిర్యాదులు, సెమీ అర్బన్ ప్రాంతంలో పట్టాదారు పాసు పుస్తకం దరఖాస్తు, నివాస స్థలాలుగా చూపిన ప్రాంతాల్లో పాసు పుస్తకం, మ్యుటేషన్ దరఖాస్తు, పట్టాదారు పాసు పుస్తకం లేకుండా, అసైన్డ్ భూముల వారసత్వం దరఖాస్తు సంబంధిత అంశాలపై కలెక్టర్ తుది ఆమోదం ఉంటుందని తెలిపారు. దరఖాస్తులను నిర్ణీత సమయంలోగా పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

వేమనపల్లి: ధరణి పోర్టల్‌లో పెండింగ్‌లో ఉన్న సమస్యలను స్పెషల్ డ్రైవ్ ద్వారా పరిష్కరించేం దుకు చర్యలు తీసుకుంటున్నామని తహసీల్దార్ రమేష్ తెలిపారు. శుక్రవారం ఆయన కార్యాలయంలో మాట్లాడుతూ మండలంలో మొత్తం 89 మంది రైతులకు చెందిన ధరణి సమస్యలు ఉన్నట్లు తెలిపారు. ఈ నెల 9వ తేదీ వరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి పరిష్కరిస్తామన్నారు. శుక్రవారం 8 పట్టాదారు పాసుపుస్తకాల సవరణ, ఒక విరాసత్ సమస్యను పరిష్కరించినట్లు తెలిపారు. తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్ రెండు బృందాలుగా ఏర్పడి మండలంలో పర్యటించి పెండింగ్ సమస్యలను పరిష్కరించనున్నట్లు పేర్కొన్నారు.

భీమారం: ధరణి పెండింగ్ సమస్యలపై తహసీల్దార్ సదానందం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 9వ వరకు ధరణి పెండింగ్ సమస్యలపై ప్రత్యేక డ్రైవ్ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. దీన్ని విజయవంతం చేయాలని కోరారు. నాయబ్ తహసీల్దార్ కృష్ణ, సీనియర్ అసిస్టెంట్ స్రవంతి, సిబ్బంది పాల్గొన్నారు.

ఐజీగా బాధ్యతలు స్వీకరించిన సీపీ



ఏసీసీ, మార్చి 1: రామగుండం సీపీ శ్రీనివాసులు ఇటీవల రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఐజీగా పదోన్నతి పొందగా శుక్రవారం ఐజీగా బాధ్య తలు స్వీకరించారు. ఫిబ్రవరి 14న డీఐజీ హోదాలో రామ గుండం పోలీస్ కమి షనర్‌గా బాధ్యతలు చేపట్టారు. పోలీస్ కమిషనరేట్ హెడ్ క్వార్టర్స్‌లో పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించిన అనంతరం బాధ్యతలు చేపట్టారు. ఐజీని పలువురు పోలీసు అధికారులు అభినందించారు.

మంచిర్యాల డీసీపీగా అశోక్‌కుమార్

ఏసీసీ, మార్చి 1: మంచిర్యాల డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్‌గా 2019 బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్ అధికారి అశోక్‌కుమార్‌ను నియమిస్తూ చీఫ్ సెక్రెటరీ శాంతికుమారి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఓఎస్‌డీగా విధులు నిర్వహిస్తున్న అశోక్‌కుమార్‌ను బదిలీ చేసి మంచిర్యాల డీసీపీగా పోస్టింగ్ ఇచ్చారు. ప్రస్తుతం డీసీపీగా పని చేస్తున్న 2018 బ్యాచ్ ఐపీఎస్ అధికారి సుధీర్‌రాంనాథ్‌కేకన్‌ను మహబూబాబాద్ జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్‌గా పోస్టింగ్ ఇచ్చారు.

పల్స్‌పోలియో విజయవంతం చేయాలి

దండేపల్లి, మార్చి 1: పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీపీ గడ్డం శ్రీనివాస్ సూచించారు. శుక్రవారం దండేపల్లి, తాళ్లపేట పీహెచ్‌సీ పరిధిలోని వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లకు 3న నిర్వహించే జాతీయ పల్స్ పోలియో కార్యక్రమంపై వైద్యాధికారులు, సిబ్బందికి అవగాహన కల్పించారు. ఎంపీపీ మాట్లాడుతూ 3 నుంచి 5 సంవత్సరాలలోపు చిన్నారులకు ఆదివారం పోలియో చుక్కలు వేయించేలా ప్రచారం చేయాలన్నారు. దండేపల్లి పీహెచ్‌సీ పరిధిలో 2789 మంది చిన్నారులు ఉండగా 24 బూత్‌లు, 4రూట్‌లు, 1 మొబైల్‌టీమ్, తాళ్లపేట పరిధిలో 1251 మంది చిన్నారులకు 17 బూతులు, 2 రూట్లు, 1మొబైల్ టీమ్‌ను ఏర్పాటు చేసినట్లు వైద్యాధికారులు డాక్టర్ సతీష్, డా.క్రాంతిలు తెలిపారు. 4, 5తేదీలలో ఇంటింటికి వెళ్లి చుక్కలు వేయించుకోని పిల్లలకు వేయాలన్నారు. ఎంపీడీవో ప్రసాద్, దండేపల్లి, తాళ్లపేట ప్రభుత్వ వైద్యాధికారులు సతీష్, క్రాంతి, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఇంటర్, పదో తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

మంచిర్యాల కలెక్టరేట్, మార్చి 1: ఇంటర్మీడియట్, 10వ తరగతి వార్షిక పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అన్నారు. శుక్రవారం హైద్రాబాద్ నుంచి డీజీపీ, రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్‌లు, అదనపు కలెక్టర్‌లతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ ఈ నెల 19వ తేదీ వరకు ఇంటర్, ఈ నెల 18 నుంచి ఏప్రిల్ 2 వరకు 10వ తరగతి పరీక్షలు జరుగుతాయని తెలిపారు.

జిల్లాలోని పరీక్ష కేం ద్రాల్లో విద్యార్థులకు అసౌకర్యాలు కలగకుండా ఏర్పా ట్లు చేయాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న గ్యారంటీ పథకాలను అర్హులకు అందేలా చర్యలు తీసుకోవాల న్నారు. కలెక్టర్ బదావత్ సంతోష్ మాట్లాడుతూ ఇం టర్ పరీక్షల నిర్వహణకు జిల్లాలో 25 కేంద్రాలను ఏర్పాటు చేసి సౌకర్యాలు కల్పించామన్నారు. అదనపు కలెక్టర్ మోతిలాల్, అధికారులు, పాల్గొన్నారు.



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్

మాస్ కాపీయింగ్ లేకుండా పరీక్షలు నిర్వహించాలి

మాస్ కాపీయింగ్‌కు తావు లేకుండా పకడ్బందీగా పరీక్షలు నిర్వహించాలని కలెక్టర్ బదావత్ సంతోష్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని విజన్ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 25 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలుతోపాటు పోలీసు బందోబస్తు నిర్వహిస్తున్నామన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్ష

ఏసీసీ: జిల్లాలో శుక్రవారం ఇంటర్ పరీక్ష సజా వుగా సాగింది. జనరల్‌లో 5788 మంది విద్యార్థులకు గాను 5445 మంది పరీక్షకు హాజరు కాగా ఒకేషనల్ విభాగంలో 1146 మందికి 1057 మంది హాజర య్యారు. మొత్తం 6934 మందికి 6502 మంది హాజ రు కాగా 432 మంది గైర్హాజరయ్యారు. మొత్తం విద్యా ర్థుల్లో హాజరైన వారు 93.77 శాతం. జిల్లా వ్యాప్తంగా 25 పరీక్ష కేంద్రాల్లో పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు డీఐఈవో శైలజ తెలిపారు.

బీఆర్ఎస్ పాలనలో పది లక్షల కోట్ల కుంభకోణం

మందమర్రిటౌన్, మార్చి 1: గత బీఆర్ఎస్ పాలనలో పది లక్షల కోట్లకు పైగా కేసీఆర్ కుటుంబం అవినీతికి పాల్పడిందని, కళ్ల ముందు కుంభకోణాలు కనిపిస్తున్నాయని చెన్నూరు ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి విమర్శించారు. నిర్మాణం చేపట్టిన మూడేళ్లలో పగుళ్లు తేలిన ప్రాజెక్టు పర్యటనకు బీఆర్ఎస్ నేతలను తీసుకురావడంపై కేటీఆర్ సిగ్గుపడాలని ధ్వజమెత్తారు. శుక్రవారం రాత్రి మందమర్రి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టులో లక్ష కోట్ల కుంభకోణం జరిగింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. మిషన్ భగీరథ పేరుతో రూ.50 వేల కోట్లు, ధరణి పేరుతో హైద్రాబాద్ చుట్టుపక్కల 25 వేల ఎకరాల భూములను కాజేశారని, వీటి విలువ రూ.8 లక్షల కోట్లకు పైగా ఉంటుందని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి ఐదు సంవత్సరాల్లో 940 టీఎంసీలు నీరు రావాల్సి ఉండగా కేవలం 160 టీఎంసీల నీరు మాత్రమే వచ్చిందన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా 17 లక్షల ఎకరాలకు సాగు నీరందించాల్సి ఉండగా కుప్పకూలిపోయిందని విమర్శించారు. ప్రాజెక్ట్ వల్ల ప్రజలపై ఆర్థిక భారం పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. నియోజకవర్గమే కాకుండా పక్కన ఉన్న మంథని నియోజకవర్గంలో పంటలు మునిగే పరిస్థితి నెలకొందన్నారు. కుంభకోణాలపై కమిటీ వేయాలని, సీబీఐతో దర్యాప్తు చేయించాలని కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర ప్రగతే ధ్యేయంగా పనిచేస్తుందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ విజయం సాధిస్తుందని పేర్కొన్నారు. నాయకులు నోముల ఉపేందర్ గౌడ్, గుడ్ల రమేష్, దుర్గం నరేష్, సొత్కు సుదర్శన్, నర్సింగ్, శ్రీనివాస్, బండి సదానందం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి

వైభవంగా అతిరుద్ర మహాయాగం



యాగ శాలలో మాట్లాడుతున్న పీఠాధిపతులు

లక్సెట్టిపేటరూరల్, మార్చి 1: లక్సెట్టిపేట పట్టణంలో ఐదు రోజులుగా నిర్వహిస్తున్న అతి రుద్ర మహాయాగం కన్నుల పండువగా కొనసాగుతుంది. శుక్రవారం హంపీ పీఠాధిపతి జగద్గురువు శంకరాచార్యులు, మధనానంద పీఠాధిపతి మధనానంద సరస్వతి స్వామిల ఆధ్వర్యంలో మహాయాగం నిర్వహించారు. 200 మంది వేద పండితులతో పీఠాధిపతులు వేద మంత్రాలతో యాగం నిర్వహించారు. అనంతరం అతి రుద్ర మహాయాగం నిర్వహించడం వల్ల ప్రజలకు కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. మున్సిపల్ ఛైర్మన్ నల్మాసు కాంతయ్య, మాజీ డీసీఎంఎస్ ఛైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, రమేష్ పాల్గొన్నారు.

వార్డులో పారిశుధ్య పనులు

బెల్లంపల్లి, మార్చి 1: పట్టణంలోని 16వ వార్డులో మున్సిపల్ ఛైర్‌పర్సన్ శ్వేత పారిశుధ్య పనులను చేయించారు. డ్రైనేజీలను సిబ్బందితో శుభ్రం చేయించారు. సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే సహకారంతో కృషి చేస్తానని ఛైర్‌పర్సన్ తెలిపారు. శ్రీనివాస్, రాజలింగు, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

11న జేఎల్‌ఎం సర్టిఫికెట్ల పరిశీలన

గణేశ్‌నగర్, మార్చి 1: టీఎస్ఎన్‌పీడీసీఎల్ కరీంనగర్‌సర్కిల్ కార్యాలయంలో నిర్వహించే ఆరో విడత జూనియర్ లైన్‌మెన్(జేఎల్‌ఎం) సర్టిఫికెట్ల పరిశీలన, స్తంభం ఎక్కించే పరీక్షలను 11న సోమవారం ఉదయం 9 గంటల నుంచి నిర్వహిస్తున్నట్లు ఎస్ఈ వడ్లకొండ గంగాధర్ ఒక ప్రకటనలో తెలిపారు. జేఎల్‌ఎం అభ్యర్థులకు వారి యొక్క చిరునామాలకు రిజిస్టర్ పోస్ట్ ద్వారా కాల్ లెటర్లు పంపించామన్నారు. జాబితాను నోటీసు బోర్డులో కూడా ఉంచామన్నారు. కాల్ లెటర్ అందనివారు కరీంనగర్ సర్కిల్ కార్యాలయంలో కాల్ లెటర్‌ను పొందవచ్చని తెలిపారు. జేఎల్‌ఎం నియామక కమిటీ ద్వారా అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన, స్తంభం ఎక్కించడం పరీక్షలను పారదర్శకంగా నిర్వహిస్తామని తెలిపారు. జేఎల్‌ఎం అభ్యర్థులు ఎలాంటి ప్రలోభాలను నమ్మవద్దని కోరారు.

నిందితులకు జరిమానా

లక్షెట్టిపేటరూరల్, మార్చి 1 : పంట పొలాన్ని ధ్వంసం చేసిన కేసులో లక్షెట్టిపేట న్యాయస్థానం ఇద్దరు నిందితులకు జరిమానా విధించినట్లు ఎస్ఐ చంద్రకుమార్ తెలిపారు. లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన అప్పని లింగయ్య పొలంలోకి అదే గ్రామానికి చెందిన సూరమల్ల చంద్రయ్య, దుర్గయ్యలు 2018 ఆగస్టు 22న పొలంను ధ్వంసం చేయడంతోపాటు లింగయ్యను కొట్టారు. బాధితుడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్ఐ మధుసూదన్‌రావు కేసు నమోదు చేశారు. నిందితులను కోర్టులో హాజరు పర్చగా జూనియర్ సివిల్ జడ్జి మహ్మద్ అసదుల్లా షరీఫ్ చంద్రయ్యకు రూ.200 జరిమానా, దుర్గయ్యకు వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ శుక్రవారం తీర్పు వెల్లడించారని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయాలు

బెల్లంపల్లి, మార్చి 1 : బెల్లంపల్లిలోని హార్టీకల్చర్ నర్సరీ వద్ద ఆటో, మోటార్ సైకిల్ ఢీకొన్న ఘటనలో పలువురికి గాయాలైనట్లు ఎస్ఐ నరేష్ తెలిపారు. శుక్రవారం ఉదయం కొండగొర్ల చంద్రశేఖర్ తన బైక్‌పై డిగ్రీ కళాశాలకు వెళ్తుండగా మార్గమధ్యలోని హార్టీకల్చర్ నర్సరీ వద్ద తాళ్లగురిజాల నుంచి బెల్లంపల్లి వైపు వెళ్తున్న ఆటో వేగంగా వచ్చి మోటార్ సైకిల్‌ను ఢీకొట్టాడు. దీంతో మోటార్ సైకిల్ కింద పడి చంద్రశేఖర్‌కు గాయాలయ్యాయి. ఆటోలో ప్రయాణిస్తున్న ఐదుగురుకి కూడా గాయాలయ్యాయి.స్థానికులు 108 అంబులెన్స్‌లో బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. చంద్రశేఖర్ సోదరుడు గంగారం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మోదుగు పూల అందాలు



దండేపల్లి, మార్చి 1: దండేపల్లి మండలం తాళ్ళపేట నుంచి ముత్యంపేట ప్రధాన రహదారి ఇరువైపుల అక్కడక్కడ మోదుగ చెట్లుకు మోదుగు పూవ్వులు విరగబూసి కనువిందు చేస్తున్నాయి. వేసవిలో అన్ని చెట్ల ఆకులు రాలి చిగురులతో ఆకట్టుకోగా మోదుగ చెట్లు మాత్రం విరబూసిన పూలతో ఆకట్టుకుంటున్నాయి. మండలంలో అటవీ ప్రాంతంలో కాషాయ రంగులో మోదుగు పూలు విరబూసాయి.

నిరుద్యోగ యువతకు సింగరేణి చేయూత

● స్కిల్ డెవలప్మెంట్‌తో ఉపాధి అవకాశాలు
● శిక్షణకు మంచి స్పందన

మందమర్రి టౌన్, మార్చి 1: సింగరేణి సంస్థ నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధికల్పించాలనే లక్ష్యంతో మందమర్రిలో మొట్టమొదటిసారిగా స్కిల్‌డెవలప్మెంట్ సెంటర్‌ను ఏర్పాటుచేసింది. ఫిబ్రవరి19న ఈ సెంటర్‌ను ప్రారంభించారు. ప్రస్తుతం దీనిలో రెండుకోర్సులలో నిరుద్యోగులకు శిక్షణ ఇస్తున్నారు. డ్రోన్‌టెక్నీషియన్‌కు సంబంధించి 20మంది, సోలార్ టెక్నీషియన్‌కు సంబంధించి 30మంది శిక్షణ పొందుతున్నారు. డ్రోన్‌తో ఉండే ఉపయోగాలతోపాటు భవిష్యత్‌లో దాని ప్రాధాన్యత ఎలా ఉంటుందో తెలియజేస్తున్నారు. డ్రోన్ శిక్షణ పూర్తి చేసిన తర్వాత ఆయా సంస్థల్లో ఉపాధి చూపించనున్నారు. సోలార్‌కు సంబంధించి రానున్న రోజుల్లో బొగ్గు ఆధారిత విద్యుత్ కనుమరుగయ్యే అవకాశాలు ఉన్నాయని తెలియజేస్తున్నారు. రానున్న రోజుల్లో సోలార్ విద్యుత్‌దే ప్రముఖపాత్ర. దీని గురించి శిక్షణ పూర్తి చేసుకొని సర్టిఫికెట్ పొందడం ద్వారా సొంతగా సోలార్ నిర్మాణాలు చేసుకోవడంతోపాటు సంస్థలో పనిచేస్తే మంచి వేతనాలు పొందవచ్చన్నారు. శుక్రవారంతో రెండు శిక్షణలకు సంబంధించి 50మంది కోర్సును పూర్తి చేసుకుంటున్నారు. వీరికి జీఎం చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందజేయనున్నారు.


డ్రోన్ టెక్నీషియన్ శిక్షణ పొందుతున్న విద్యార్థులు


సోలార్ ప్రాజెక్టును చూపిస్తున్న శిక్షకుడు

● స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ఒక వరం..
- గుండేటి శంకర్, ట్రైనింగ్ సెంటర్ మేనేజర్

నిరుద్యోగులకు స్కిల్‌డెవలప్మెంట్ సెంటర్ ఒకవరం. సోలార్, డ్రోన్ టెక్నీషియన్ కోర్సులను ప్రారంభించాం. 15 రోజుల షార్ట్‌టైం కోచింగ్. అభ్యర్థులు పట్టుదలతో శిక్షణ తీసుకుంటున్నారు. శిక్షణ అనంతరం ప్రభుత్వ ఆర్డీఎస్డీ సంస్థ ద్వారా సర్టిఫికెట్ అందజేస్తాం.

● సింగరేణికి కృతజ్ఞతలు..
- సయ్యద్ అఫ్రోజ్‌హుస్సేన్, ట్రైనీ



స్కిల్‌డెవలప్మెంట్ సెంటర్‌లో డ్రోన్ శిక్షణ పొందుతున్నాను. అర్థమయ్యే విధంగా శిక్షకులు వివరిస్తున్నారు. దీని ద్వారామంచి ప్లేస్మెంట్ సాధిస్తాననే నమ్మకం ఉంది.

● ఇలాంటి కోర్సులు అవసరం..
- దుర్గం రవికిరణ్, ట్రైనీ



ఇలాంటి వృత్తి శిక్షణ కోర్సులు నిరుద్యోగులకు ఎంతో అవసరం. స్కిల్ డెవలప్మెంట్ సెంటర్‌లో సోలార్ టెక్నీషియన్ శిక్షణ పొందుతున్నాను. శిక్షణ పూర్తి చేసిన అనంతరం మంచిభవిష్యత్ ఉంటుందని విశ్వసిస్తున్నాను.

బీసీలకు రుణాలు అందజేయాలి

బెల్లంపల్లి, మార్చి 1: బీసీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలని మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుకు రేవంత్‌రెడ్డి సైన్యం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొలిపాక శ్రీనివాస్ శుక్రవారం హైద్రాబాద్‌లో కలిసి వినతి పత్రం అందించారు. బీసీ సబ్సిడీ రుణాలు లేక బీసీలు ఇబ్బందులు పడుతున్నారని, గత ప్రభుత్వంలో నిలిచిన బీసీ రుణాలను వెంటనే ఇవ్వాలని కోరారు. పద్మశాలి కార్పొరేషన్ ఏర్పాటు చేసి చేనేతకు చేయూతనందించాలన్నారు. అనంతరం మంత్రిని శాలువాలతో సన్మానించారు.

దంపతుల కిడ్నాప్‌ను ఛేదించిన పోలీసులు

ఏసీసీ, మార్చి 1: మంచిర్యాల జిల్లా కేంద్రంలో గురువారం సాయంత్రం దంపతుల కిడ్నాప్ వ్యవహారం కలకలం రేపింది. పట్టణ సీఐ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం హాజీపూర్ మండలం ర్యాలీ గ్రామానికి చెందిన బియ్యాల రవి, గాయత్రి దంపతులు డీమార్ట్ సమీపంలో ఉండగా టీఎస్09ఈఆర్9866 కారులో వచ్చిన నలుగురు దుండగులు దంపతులను బలవంతంగా కారులో ఎక్కించుకుని వెళ్లారు. ఆటో డ్రైవర్ నాజర్ గమనించి పోలీసులకు సమాచారం అందించాడు. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి గురువారం రాత్రి కారును చెన్నూరు శివారులో పట్టుకున్నారు. కిడ్నాపర్లను అదుపులోకి తీసుకుని విచారించగా దండేపల్లి మండలం వెల్గనూరు గ్రామానికి చెందిన గడికొప్పుల శ్రీనివాస్, మచ్చ సతీష్, గూడెం గ్రామానికి చెందిన చుంచు అజయ్, చెన్నూరు మండలానికి చెందిన చల్ల స్నేహిత్‌రెడ్డిగా గుర్తించారు. కిడ్నాప్‌కు గురైన రవి గతంలో నిందితుల వద్ద నుంచి గుప్తనిధులు వెతికి పెడతానని నమ్మబలికి డబ్బులు వసూలు చేసి తప్పించుకు తిరుగుతున్నాడు. డబ్బులు తిరిగి ఇవ్వకుండా, గుప్తనిధుల ఆచూకీ చూపకుండా తప్పించుకు తిరుగుతున్న రవి కోసం నిందితులు ర్యాలీ గ్రామానికి వెళ్తుండగా డీమార్టు సమీపంలో భార్యతో పాటు కనిపించడంతో కారులో బలవంతంగా ఎక్కించుకుని కిడ్నాప్ చేశారని సీఐ తెలిపారు. ఈ మేరకు నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కూలీలందరికి పని కల్పించాలి

లక్షెట్టిపేటరూరల్, మార్చి 1 : అర్హులైన కూలీలందరికి ఉపాధిహామీలో పనులను కల్పించాలని ఎంపీడీవో సరోజ అన్నారు. శుక్రవారం రంగపేట హన్మంతుపల్లి,చందారం గ్రామాల్లో ఎంపీడీవో పర్యటించారు. ఆమె మాట్లాడుతూ ఉపాధిహామీ పథకంలో పని కల్పించి రోజుకు రూ.272 వేతనం అందించాలని తెలిపారు. అనంతరం పని ప్రదేశాలను, నర్సరీలు, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలను పరిశీలించి సూచనలు చేశారు. ఏపీవో వెంకటరమణ, టెక్నికల్ అసిస్టెంట్ రాజన్న,పంచాయతీ కార్యదర్శులు ప్రదీప్,మౌనిక , శ్రీలత పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

వేమనపల్లి, మార్చి 1 : జక్కెపల్లి గ్రామానికి చెందిన పొర్శెట్టి అశోక్ (38) శుక్రవారం మం చిర్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందు తూ మృతి చెందాడు. అశోక్ రెండేళ్లుగా మద్యా నికి బానిసయ్యాడు. గురువారం మద్యం తాగి ఇంటికి వచ్చిన అశోక్‌ను భార్య అనసూయ మందలించింది. మనస్తాపం చెందిన అశోక్ ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబీకులు 108 అంబులెన్స్‌లో చెన్నూరు ఆసుపత్రికి తరలించగా మెరుగైన చికిత్స కోసం మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్సపొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు నీల్వాయి ఎస్ఐ సుబ్బారావు తెలిపారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి


మాట్లాడుతున్న బోగె ఉపేందర్

రెబ్బెన, మార్చి 1: కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బోగే ఉపేందర్ అన్నారు. శుక్రవారం స్థానికంగా ఆయన మాట్లాడారు. భవన నిర్మాణంలో ప్రభుత్వం కడుతున్న ఒకశాతం సెస్సును 2శాతంకు పెంచాలని డిమాండు చేశారు. అలాగే పెండింగ్ సమస్యలను కూడా పరిష్కరించాలన్నారు. సంక్షేమ పథకాల్లో తొలి ప్రాధాన్యం కార్మికులివ్వాలని కోరారు. సమావేశంలో మండల అధ్యక్షుడు లింగయ్య, ప్రధాన కార్యదర్శి దాగం బాబురావు, కోశాధికారి ఎండీ రఫీక్ తదితరులు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలన పోస్టర్ల విడుదల

సిర్పూర్(టి), మార్చి 1: మండలంలోని చింతకుంట, అచ్చెల్లి, భూపాలపట్నం గ్రామంలో పేదరిక నిర్మూలన కమిటీ జిల్లా అధ్యక్షుడు చంద్రగిరి సుదర్శన్, మాజీ జడ్పీటీసీ రాంనాయక్ పేదరిక నిర్మూలన పోస్టర్లను విడుదల చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పేద నిర్మూలనపై ప్రభుత్వం దృష్టి సారించాలన్నారు.

రైలు కిందపడి ఒకరి ఆత్మహత్య

కాగజ్‌నగర్, మార్చి 1: కుటుంబ కలహాలతో దుర్గానగర్ విలేజీనెం.10కి చెందిన సంజయ్ మండల్(25) శుక్రవారం మధ్యాహ్నం జీటీఎక్స్‌ప్రెస్ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్టు రైల్వే హెడ్‌కానిస్టుబుల్ సురేష్ గౌడ్ తెలిపారు. ఈ మేరకు మృతదేహాన్ని పరీక్ష నిమిత్తం సిర్పూరు(టి) సామాజికి ఆసుపత్రికి తరలించినట్టు వివరించారు.

వర్గీకరణ పేరుతో దళితులను మోసం చేస్తున్న బీజేపీ


మాట్లాడుతున్న మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు రాంమూర్తి

బెల్లంపల్లి, మార్చి 1: ఏబీసీడీ వర్గీకరణ పేరుతో దళితులను బీజేపీ మోసం చేస్తుందని మాల మహానాడు ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు పసుల రాంమూర్తి, రాష్ట్ర అధ్యక్షుడు జూపాక శ్రీధర్, జాతీయ కార్యదర్శి కాసర్ల యాదగిరిలు పేర్కొన్నారు. శుక్రవారం బెల్లంపల్లి పట్టణంలో వారు మాట్లాడుతూ బీజేపీ ఎస్సీ వర్గీకరణ పేరుతో మాదిగలను పార్టీలో చేర్పించుకుంటూ మోసం చేస్తుందన్నారు. దేశంలోని ప్రజలను మతం మత్తుతో బీజేపీ వందేండ్లు వెనకకు నెడుతుందని మండిపడ్డారు. దళితులు ఎవరు కూడా బీజేపీలో చేరవద్దని సూచించారు. బీజేపీ ఎస్సీ వర్గీకరణకు మద్దతు తెలిపినా మాలలు ఎందుకు ప్రశ్నిస్తలేరని ఆవేదన వ్యక్తం చేశారు. వర్గీకరణను వారం రోజుల్లో తేల్చకుంటే బీజేపీ రాష్ట్ర కార్యాలయాన్ని ముట్టడిస్తామని తెలిపారు. నాయకులు ముత్తమాల పుల్లయ్య, సబ్బని రాజనర్సు, వెంకటికుమార్, ఎరుకల శ్రీనివాస్, రవళి, శివ, సాంబయ్య పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యం కోసమే హెల్త్ సబ్ సెంటర్ ఏర్పాటు


సబ్ సెంటర్ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే

జైపూర్, మార్చి 1: ప్రజల ఆరోగ్యం కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం సబ్ సెంటర్ల ఏర్పాటుకు కృషి చేస్తుందని ఎమ్మెల్యే గడ్డం వివేక్‌వెంకటస్వామి పేర్కొన్నారు. శుక్రవారం కుందారం పీహెచ్‌సీ పరిధిలోని ఇందారంలో ఏర్పాటు చేసిన సబ్ సెంటర్ నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. ఆయన మాట్లాడుతూ నేషనల్ హెల్త్ మిషన్ స్కీం నిధులు రూ.20 లక్షలతో నిర్మాణం చేపడుతున్నామన్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. జైపూర్ మండలాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని ఆయన పేర్కొన్నారు. అనంతరం ఇందారం, కాసింపల్లి గ్రామాల్లో ఈజీఎస్ నిధులు రూ.4 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. వైస్ ఎంపీపీ పెద్దపల్లి రమేష్, మెడికల్ ఆఫీసర్ శ్రావ్య, కాంగ్రెస్ నాయకులు ఫయాజ్, సుంకరి శ్రీనివాస్, జక్కుల వెంకటేశం, శ్రీనివాస్, జైనోద్దీన్, విశ్వంభర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

వినతుల వెల్లువ

భీమారం: మండలంలోని ఎల్కేశ్వరం, మద్దికల్ గ్రామాల ప్రజలు ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామికి సమస్యలను విన్నవించారు. శుక్రవారం కొత్తపల్లిలోని శుభకార్యానికి వచ్చిన ఎమ్మెల్యేను కలిసి సమస్యలను తెలిపారు. మద్దికల్‌లో డ్రైనేజీలు లేక దుర్వాసన వస్తుందని, తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. ఎల్కేశ్వరం రోడ్డు వద్ద ఎమ్మెల్యేను నాయకుడు శ్యాంసుందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రజలు సమస్యలను విన్నవించారు. లక్ష్మణ్, రవి,రమేష్ తదితరులు పాల్గొన్నారు.

'ఇస్రో యువికా' సద్వినియోగ పర్చుకోవాలి

ఏసీసీ, మార్చి 1: యువ శాస్త్రవేత్తలను తయారు చేయాలనే సంకల్పంతో ఇస్రో చేపట్టిన యువికా కార్యక్రమాన్ని జిల్లాలోని 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు సద్వినియోగపర్చుకోవాలని డీఈవో యాదయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 20 వరకు ఆన్ లైన్ ద్వారా దరఖాస్తులను అందజేయాలని సూచించారు. విద్యార్థులను యువ శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దాలనే ఉద్దేశ్యంతో అంతరిక్ష శాస్త్రంపై అవగాహన, ప్రాథమిక పరిజ్ఞానం అందించడమే లక్ష్యంగా యువికా కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. వివరాలకు www.isro.gov.in వెబ్‌సైట్‌లో సంప్రదించాలన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

జన్నారం, మార్చి 1: దేవునిగూడలో పోకల చంద్రయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా శుక్రవారం కుటుం బాన్ని గవ్వల శ్రీకాంత్, అనసూయలు పరామర్శించారు. బియ్యం, నిత్యావసర సరుకులతో పాటు ఆర్థిక సహాయం అందించారు. జాడి నర్సయ్య, వినయ్, సత్తన్న, రాజవ్వ, సత్యం, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

అత్తమామలపై కాల్పులు జరిపిన వ్యక్తి అరెస్టు

బెల్లంపల్లి, మార్చి 1 : కన్నెపల్లి మండలం సాలిగాం గ్రామంలో గోలేటి శంకర్ కుటుంబాన్ని బెదిరించి కాల్పులు జరిపిన నిందితున్ని శుక్రవారం అదుపులోకి తీసుకున్నట్లు ఏసీపీ రవికుమార్ తెలిపారు. శుక్రవారం తాళ్లగురిజాల సీఐ కార్యాలయంలో వివరాలను వెల్లడించారు. గోలేటి శంకర్, లక్ష్మీ దంపతులకు ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తె బేబిని మాల గురిజాలకు చెందిన గోమాస నరేందర్‌తో 2016లో వివాహం జరిపించారు. అప్పటి నుంచి నరేందర్ భార్య, అత్తమామలను ఆస్తి, అదనపు కట్నం కోసం వేధించేవాడు. గత నెల 27న రాత్రి నరేందర్ పిస్టల్‌తో సాలిగాం వచ్చి అత్తామామలను చంపుతానని బెదిరిస్తూ పిస్టల్‌తో రెండు రౌండ్లు కాల్పులు జరిపి స్నేహితుడు మహేష్‌తో కలిసి పారిపోయాడు. ఈ సంఘటనపై గోలేటి శంకర్ 28న ఫిర్యాదు చేశాడని తెలిపారు. సాంకతిక పరిజ్ఞానం వినియోగించుకుని నరేందర్‌ను పట్టుకున్నట్లు ఏసీపీ తెలిపారు. అతన్ని విచారించగా కొన్నేళ్ళుగా కరీంనగర్‌లోని పేపరు ప్లేట్ కంపెనీలో పని చేస్తూ నగునూర్‌లో భార్య, పిల్లలతో ఉంటున్నాడని తెలిపారు. అతని జల్సాలకు డబ్బులు దొరక్క ఆర్థిక ఇబ్బందులు ఎదురైనట్లు తెలిపారు. పెళ్లిలో ఇస్తానన్న రూ.10 లక్షలు ఇవ్వకపోవడంతో అత్తామామలను చంపాలనే ఉద్దేశ్యంతో అతనితోపాటు పని చేస్తున్న బీహార్‌కు చెందిన రవిందర్ పెళ్లికి వెళ్లి పిస్టల్, బుల్లెట్లను కొనుగోలుచేశాడు. గతనెల 26న కరీంనగర్ నుంచి బయలుదేరి 27 స్నేహితుడు కోడి మహేష్‌ను మాలగురిజాలలో బైక్‌పై ఎక్కించుకుని సాలిగాంకు వెళ్ళాడు. వెంట తెచ్చుకున్న పిస్టల్‌తో అత్తామామలను బెదిరించగా వారు ఇంట్లోకి వెళ్లి తలుపులు వేసుకోగా నరేందర్ రెండు రౌండ్లు కాల్చి అక్కడ నుంచి పరారయ్యాడని తెలిపారు. తాళ్లగురిజాలలో తలదాచుకున్నాడనే సమాచారం మేరకు పోలీసులు నరేందర్‌ను పట్టుకున్నామని, మహేష్ పరారీలో ఉన్నట్లు ఏసీపీ తెలిపారు. నిందితుడి నుంచి ఒక పిస్టల్‌తో పాటు బుల్లెట్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసును త్వరగా ఛేదించిన తాళ్లగురిజాల సీఐ, ఎస్ఐలను పోలీసు ఉన్నతాధికారులు అభినందించినట్లు తెలిపారు.


సమావేశంలో వివరాలను వెల్లడిస్తున్న ఏసీపీ రవికుమార్

వన్యప్రాణులకు హాని తలపెట్టవద్దు: డీఎఫ్‌వో

దహెగాం, మార్చి 1: వన్యప్రాణులకు ఎలాంటి హానీ తలపెట్టవద్దని డీఎఫ్‌వో నీరజ్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఖర్జి గ్రామంలో ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యుత్‌తీగలు అమర్చడం, ఉచ్చులు ఏర్పాటు చేయడం వంటి వాటితో వన్యప్రాణులను వేటాడితే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వన్య ప్రాణుల దాడిలో పశువులు మృతిచెందితే తక్షణ సాయంగా రూ.5వేలు, వారంరోజుల్లో పూర్తి పరిహారం ఇస్తామని అన్నారు. అదేవిధంగా అడవులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. వేసవి సమీపిస్తున్నందున అడవులకు మంటలు వ్యాపించకుండా తగిన చర్యలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. అంతకు ముందు కొంచవెల్లి, ఖర్జీ గ్రామాల్లోని ప్లాంటేషన్లను, గడ్డిమైదాలను, లోహ అటవీ ప్రాంతాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఎఫ్‌ఆర్‌వో నిజాముద్దీన్, డీఆర్‌వో శ్రీధర్ చారి, ఎఫ్ఎస్‌వో రవి బాబు, ఎఫ్‌బీవోలు మధుకర్, సద్దాం, మాజీ సర్పంచ్ సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.


గడ్డి మైదానాలను పరిశీలిస్తున్న డీఎఫ్‌వో నీరజ్‌కుమార్

శాంతి భద్రతలు కాపాడటం ప్రతిఒక్కరి బాధ్యత

కాగజ్‌నగర్, మార్చి 1: సమాజంలో శాంతి భద్రతలను కాపాడటం ప్రతిఒక్కరి బాధ్యత అని కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్ అన్నారు. శుక్రవారం పట్టణంలో ర్యాపిడ్ యాక్షన్‌ఫోర్సు కేంద్ర భద్రత బలగాల మార్చ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ త్వరలో ఎన్నికలు నిర్వహిస్తున్న నేపథ్యంలో అవగాహణ సదస్సులు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. పట్టణంలో ఎవరైనా చట్టవిరుద్ధంగా ప్రవర్తించినా, గొడవలు సృష్టించాలని చూసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సీఐ శంకరయ్య, ఎస్సైలు పాల్గొన్నారు.


పట్టణంలో కేంద్ర బలగాలతో కవాతు నిర్వహిస్తున్న డీఎస్పీ కరుణాకర్

పెండింగ్‌వేతనాలు చెల్లించాలి

పెంచికలపేట, మార్చి 1: గ్రామ పంచాయతీ వర్కర్లకు ఎనిమిది నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ నాయకులు కోరారు. శుక్రవారం స్థానికంగా వారు మాట్లాడుతూ వేతనాలు రాకపోవడంతో గ్రామ పంచాయతీ కార్మికుల కుటుంబాలు పోషణకు ఇబ్బందులు పడుతున్నాయని వెంటనే వేతనాలు విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో చంద్రశేఖర్, రామయ్య, కృష్ణమాచారి తదితరులు పాల్గొన్నారు.

దొంగతనం చేసిన నిందితుడి రిమాండ్

శ్రీరాంపూర్, మార్చి 1 : శ్రీరాంపూర్ ఏరియాలో బుధవారం జరిగిన దొంగతనం కేసులో నిందితుడిని పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. ఎస్ఐ సంతోష్ తెలిపిన వివరాల ప్రకారం... వాటర్ ట్యాంక్ ఏరియాకు చెందిన కొర్ర నాగార్జున బుధవారం ఇంటికి తాళం వేసి ఊరికి వెళ్లాడు. అదే ఏరియాకు చెందిన మోసీన్ షేక్ అలియాస్ షాక్ అనే యువకుడు తాళాలు పగులగొట్టి రెండు తులాల బంగారు ఆభరణం, 15 తులాల వెండి ఆభరణాలు దొంగతనం చేశాడు. నాగార్జున తన ఇంటికి వచ్చి చూడగా, దొంగతనం జరిగినట్లు గుర్తించాడు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. నిందితుడు మోసీన్ షేక్ అలియాస్ షాక్‌ను పట్టుకొని శుక్రవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ వివరించారు.

మాదిగ అమరులకు నివాళులు


బెల్లంపల్లిలో నివాళులర్పిస్తున్న నాయకులు

చెన్నూరు, మార్చి 1: చెన్నూరు పట్టణంలో శుక్రవారం మాదిగ అమరవీరుల దినోత్సవాన్ని ఎంఆర్‌పీఎస్‌టీఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. అమ రుల చిత్రపటాలకు పూలమాలలు వేసి కొవ్వొత్తులతో నివాళులర్పించారు. సంఘం జిల్లా ఇన్‌చార్జి తగరం మధురాజ్ మాట్లాడుతూ బీజేపీ వర్గీకరణ పేరుతో నాటకమాడుతుందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లోపే వర్గీకరణ బిల్లు పెట్టాలని డిమాండ్ చేశారు. నాయకులు ప్రశాంత్, మల్లేష్, శ్రీధర్, సతీష్, అశోక్, దేవయ్య, పున్నం, ఆగయ్య, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

బెల్లంపల్లి: పట్టణంలోని ఎస్సీ కమ్యూనిటీ హాలులో మాదిగ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని మాదిగ హక్కుల దండోరా నాయకులు నిర్వహించారు. అమరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి కొవ్వొత్తులతో నివాళులర్పించారు. మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చిలుక రాజనర్సు మాట్లాడుతూ ప్రభుత్వాలు ఎస్సీ వర్గీకరణను వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. పట్టణాధ్యక్షుడు శివాజీ మాదిగ, ప్రధాన కార్యదర్శి నవీన్ మాదిగ, నాయకులు పాల్గొన్నారు.

సెయింట్ జాన్స్ పాఠశాలలో ఎడ్యు కార్నివాల్

రామకృష్ణాపూర్, మార్చి 1: పట్టణంలోని సెయింట్ జాన్స్ హైస్కూల్‌లో శుక్రవారం ఎడ్యు కార్నివాల్ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు వివిధ అంశాలకు సంబంధించి సుమారు 148 ప్రాజెక్టులను ప్రదర్శించారు. ప్రిన్సిపాల్ పొన్నాల సుమన్ మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయడానికి ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆయన తెలిపారు.

సాదాసీదాగా మండల సర్వసభ్య సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ

తాండూర్, మార్చి 1: మండల సమావేశం శుక్రవారం ఎంపీపీ ప్రణయ్‌కుమార్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో పరిశుభ్రత, నీటి సరఫరా విషయాల్లో అధికారులు అశ్రద్ధ చూపవద్దని సూచించారు. ఎన్ఆర్ఈజీఎస్ అధికారి నివేదిక ప్రస్తావిస్తుండగా వైస్ ఎంపీపీ దాగం నారాయణ, ఎంపీటీసీ సిరంగి శంకర్‌లు కలుగజేసుకుని వంద రోజుల పనికి సంబంధించి కొత్త జాబ్ కార్డులు ఏమైనా మంజూరు చేశారా అని అడగగా త్వరలోనే మంజూరు చేస్తామని తెలిపారు. అనంతరం ఏఈ ప్రభాకర్ మాట్లా డుతూ గృహజ్యోతి పథకానికి మండలంలోని 7800 తెల్లరేషన్ కార్డుల దారులు లబ్ధిపొందుతారని తెలిపారు. తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్, పీఏసీఎస్ చైర్మన్ దత్తు మూర్తి, ఎంపీటీసీలు రజిత, స్వప్న, యశోద, శంకర్, కోఆప్షన్ సభ్యుడు రెహమత్ ఖాన్, ఎంపీవో సత్యనారాయణ, పంచాయతీకార్యదర్శులు పాల్గొన్నారు.

బ్యాంక్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరీష్ బాబు

కాగజ్‌నగర్, మార్చి 1: బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే హరీష్ బాబు అన్నారు. శుక్రవారం బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర బ్రాంచీని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతవాసులకు మరిన్నిసేవలు అందించేందుకు బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర బ్రాంచ్ ప్రారంభం చేసినట్టు తెలిపారు. ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. సమావేశంలో బ్యాంక్ డిప్యూటీ జోనల్ మేనేజర్ మహ్మద్ షాజీ, మేనేజర్ నగేష్, పట్టణ వ్యాపారులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు పరిశీలించిన అధికారి


పనులను పరిశీలిస్తున్న ఏడీ రాజ్‌కుమార్

పెంచికలపేట, మార్చి 1: మండలకేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న సీసీరోడ్డు పనులను శుక్రవారం ఏడీ రాజ్‌కుమార్, క్యూసీ కిరణ్‌కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డునిర్మాణం నాణ్యతతో మన్నికగా నిర్మించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో ఏఈ మక్బుల్, మధుకర్, నాగన్న, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు ప్రారంభించిన ఎంపీటీసీ

చింతలమానేపల్లి, మార్చి 1: మండలంలోని అంబగట్టు గ్రామంలో అయిదు లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో సీసీ రోడ్డుపనులను ఎంపీటీసీ రోజ ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామస్థులు రాజన్న, కార్యదర్శి అశోక్, సత్తన్న, శేఖర్,భీంరావు తదితరులు ఉన్నారు.

గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలి

కెరమెరి, మార్చి 1: గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలని ఎంపీడీవో కృష్ణారావు అన్నారు. శుక్రవారం మండలంలోని మారుమూల గ్రామాలైన శివగూడ, బాబేఝరి, లైన్‌పటార్ గ్రామాల్లోపర్యటించి వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా సంబంధిత అధికారులు చొరవ చూపాలన్నారు. అలాగే ఉపాధిహామీ పనుల్లో కూలీల సంఖ్య పెంచాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం మల్లయ్య, సిబ్బంది ఉన్నారు.


బావిని పరిశీలిస్తున్న ఎంపీడీవో



డీపీవోగా భిక్షపతిగౌడ్



బాధ్యతలు స్వీకరిస్తున్న భిక్షపతిగౌడ్

ఆసిఫాబాద్, మార్చి 1: జిల్లాపంచాయతీ అధికారి (డీపీవో)గా బి భిక్షపతిగౌడ్ శుక్రవారం పదవీ బాధ్యతలను స్వీకరించారు. మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి డీఎల్‌పీవోగా పనిచేయగా పదోన్నతిపై ఆసిఫాబాద్ జిల్లా పంచాయతీ అధికారిగా ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ఆయన బాధ్యతలు చేపట్టారు. ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ డీఎల్‌పీవోలు ఉమర్‌హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

అర్చకుల పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి



అసిస్టెంట్ కమిషనర్ నవీన్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న అర్చకులు

ఆసిఫాబాద్ రూరల్, మార్చి 1: జిల్లాలో గత అక్టోబరులో డీడీఎన్ పథకం కింద ఎంపికైన అర్చకులకు రావాల్సిన పెండింగ్ వేతనాలను వెంటనే విడుదల చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు శిరీష్‌శర్మ, జిల్లా బాధ్యులు సత్యనారాయణ శర్మ కోరారు. శుక్రవారం వేతనాలు విడుదల చేయాలని కోరుతూ ఉమ్మడిజిల్లా అసిస్టెంట్ కమిషనర్ నవీన్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ నియామకమైన అర్చకులకు ఆర్డర్ కాపీలు అందజేయాలని కోరారు. వేతనాలు రాక అర్చకులు ఆర్థికంగా తీవ్రఇబ్బందులు పడుతున్నారనిపేర్కొన్నారు. ఉన్నతాధికారులు స్పందించి అర్చకులకు రావాల్సిన పెండింగ్ వేతనాలను త్వరగా విడుదల చేయాలని కోరారు.

మహిళలు సమస్యలపై నిర్భయంగా సంప్రదించాలి: ఎస్పీ

ఆసిఫాబాద్, మార్చి 1: జిల్లాలోని మహిళలు, యువతులు ఎలాంటి సమస్య లున్నా నిర్భయంగా పోలీసులను సంప్రదించవచ్చని ఎస్పీ సురేష్‌కుమార్ అన్నారు. శుక్రవారం జిల్లా హెడ్‌క్వార్టర్స్‌లో ఏర్పాటుచేసిన సమమావేశంలో మాట్లాడుతూ మహిళల రక్షణ కోసం షీటీం, యాంటి ఉమెన్‌ట్రాఫికింగ్ టీంలు పనిచేస్తున్నాయని తెలిపారు. విద్యార్థినులు, మహిళలు అన్యాయనికి గురైనప్పుడు భయపడొద్దని ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదుచేస్తే నిందితులపై చర్యలు తీసుకుంటామన్నారు. కళాశాలలు, పాఠశాలల్లో విద్యార్థులకు ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్, ఫోక్సో, యాంటిఉమెన్ ట్రాఫికింగ్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. సమస్య ఉంటే వెంటనే 8712670564 లేదా డయల్ 100 సమాచారం ఇవ్వాలన్నారు.

జాతీయ లోక్‌అదాలత్ 16వ తేదీకి వాయిదా

ఆసిఫాబాద్, మార్చి 1: ఈనెల9న జరగాల్సిన జాతీయ లోక్‌అదాలత్ కార్యక్రమం 16వ తేదీకి వాయిదా వేశామని తెలంగాణ రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ సభ్య కార్యదర్శి ఎస్ గోవర్ధన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల8,9,10తేదీల్లో వరుసగా ప్రభుత్వసెలవు దినం ఉన్నందున జాతీయలోక్ అదాలత్ కార్యక్రమాన్ని ఈనెల16వ తేదీకి వాయిదా వేశామన్నారు.

మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని

● జిల్లా సంక్షేమశాఖ అధికారి భాస్కర్

కెరమెరి, మార్చి 1: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని జిల్లా సంక్షేమశాఖ అధికారి భాస్కర్ అన్నారు. ఈనెల8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని జిల్లాలో చేపట్టిన వారోత్సవాల్లో భాగంగా మండలంలోని కోటారి గ్రామంలో లింగసమానత్వం, మహిళల హక్కులపై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. భారతదేశంలో మహిళలకు విశిష్టమైన, ఉన్నతమైన స్థానం ఉందన్నారు. మహిళల గౌరవాన్ని కాపాడేందుకు అందరూ సమన్వయంతో కృషి చేయాలన్నారు. సమాజంలో మహిళలపై జరిగే అణచివేతను అధిగమించడానికి, నియంత్రించడానికి భారత రాజ్యంగం చట్టాల ద్వారా హక్కులు కల్పించిందన్నారు. కార్యక్రమంలో మహిళాసాధికారతకేంద్రం, సఖి కేంద్రం, ఐసీడీఎస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అమరుల స్ఫూర్తితో వర్గీకరణను సాధిస్తాం



కార్యక్రమంలో మాట్లాడుతున్న కేశవరావు

ఆసిఫాబాద్, మార్చి 1: ఎస్సీ వర్గీకరణ సాధనలో తృణప్రా యంగా ప్రాణాలు అర్పించిన అమరవీరుల స్ఫూర్తితో ఎస్సీవర్గీకరణ సాధించుకుంటామని ఎమ్మార్పీఎస్ నాయకులు కేశవ రావు అన్నారు. కార్యక్రమంలో నాయకులు సాగర్, వెంకటేష్, కృష్ణ, రమేష్, వెంకటేష్, సత్తన్న, గోపాల్, మల్లయ్య, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు దుస్తులు పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న ఎంపీపీ విమల

వాంకిడి, మార్చి 1: రాష్ట్రస్థాయి కబడ్డీపోటీలకు ఎంపికైన జిల్లాకబడ్డీ జట్టుకు శుక్రవారం డ్రెస్‌కిట్‌లను ఎంపీపీ విమలాబాయి అందజేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లానుంచి రాష్ట్రస్థాయి కబడ్డీపోటీలకు ఎంపికకావడం అభినందనీయమన్నారు. రాష్ట్రస్థాయిలో జరిగే కబడ్డీపోటీల్లో తమ ప్రతిభను కనబర్చి విజయం సాధించి జిల్లా పేరు నిలబెట్టాలని అన్నారు.

ముగిసిన సీఎంఆర్ గడువు



ఇంకా రావాల్సిన బియ్యం
1.50 లక్షల క్వింటాళ్లు

రైస్ మిల్లర్లలో గుబులు

క్రిమినల్ కేసులు
పెట్టేందుకు చర్యలు?

కాగజ్‌నగర్, మార్చి 1: రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసి రైస్ మిల్లర్లకు ఇవ్వగా వీటిని కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) చేసి ఎఫ్‌సీఐ ద్వారా ఎంఎంఎల్‌ఎస్ పాయింట్లకు, రేషన్ దుకాణాలకు పంపిణీ చేస్తారు. 2022-23లో యాసంగి సీజన్‌లో రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని సీఎంఆర్ చేసేందుకు 1,62,110 క్వింటాళ్ల ధాన్యాన్ని జిల్లాలోని రైస్‌మిల్లర్లకు అధికారులు అప్పజెప్పారు. ధాన్యాన్ని బియ్యంగా మార్చేందుకు ఫిబ్రవరి 29 వరకు చివరి గడువు ఇచ్చారు. వారంరోజులుగా ఎన్‌ఫోర్సుమెంటు అధికారులు బృందాలుగా ఏర్పడి రైస్ మిల్లుల్లో తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఎన్‌ఫోర్సుమెంటు అధికారులు 1.50లక్షల క్వింటాళ్ల బియ్యం ఇంకా మిల్లర్ల నుంచి రావాల్సి ఉన్నట్టు తేల్చారు. కాగా సిర్పూరులోని రెండు రైస్ మిల్లుల నుంచి రూ.9 కోట్ల ధాన్యం దారి మళ్లినట్టు తేలింది. గడువులోగా ఇవ్వని వారిపై అధికారులు చర్యలు తీసుకునేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే పెద్దపల్లి జిల్లాలో ఇద్దరు రైస్ మిల్లర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేశారు. కుమరం భీం జిల్లాలో కూడా క్రిమినల్ కేసులు నమోదు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు సమాచారం.

లెక్క తేలినా కూడా..

సిర్పూరులోని రైస్‌మిల్లుల్లో రూ. కోట్లు విలువ చేసే సీఎంఆర్ బియ్యం దారి మళ్లినట్టు తేలింది. అయినా కూడా అధికారులు సంబంధిత రైస్‌మిల్లర్లపై ఎందుకు చర్యలు తీసుకోవటం లేదన్నది అందరి మదిలో తలెత్తుతున్న ప్రశ్న. కేవలం 6ఎ ద్వారా కేసులు నమోదు చేసి చేతులు దులుపుకుంటున్నట్టు ప్రచారం జరుగుతోంది. కోట్ల నిధుల ధాన్యం స్వాహాకు గురైనా కూడా ఉన్నతాధికారులు కనీసం క్రిమినల్ కేసులు పెట్టేందుకు కూడా ముందుకు రావటం లేదంటే అధికారుల తీరుపై అంతా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

2022 నవంబరులో జిల్లా కేంద్రంలో ఎంఎ ల్‌ఎస్ పాయింట్ నుంచి 8,349 క్వింటాళ్ల బియ్యం పక్కదారి పట్టినట్టు అధికారుల తనిఖీల్లో బయటపడితే ఇందుకు బాధ్యులను చేస్తూ డీఎస్‌వో, గోదాం ఇన్‌చార్జీని సస్పెండు చేశారు. డీఎస్‌వోకు మరో జిల్లాలో పోస్టింగ్ ఇచ్చారు. బియ్యం ఏ రైస్‌మిల్లు నుంచీ ఇంతవరకు రాలేదు. ఇందుకు బాధ్యులు ఎవరు..? ఈ కేసులో ఎంతమంది ఉన్నారు..? అన్నది ఇంతవరకు వెల్లడికాలేదంటే అధికారుల హస్తం ఏ మేరకు ఉందో ఇట్టే ఊహించుకోవచ్చు. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో బియ్యం ధరలకు డిమాండు ఉంది. దీంతో సీఎంఆర్ నిల్వలను సొమ్ము చేసుకునేందుకు పన్నాగం పన్నుతున్నారు. దీనికి బదులు సేకరించిన రాయితీ బియ్యాన్ని ఎఫ్‌సీఐకి, ఎంఎల్‌ఎస్ పాయింట్‌కు ఇస్తున్నారు.

మరో వైపు రేషన్ దుకాణాల నుంచి సైతం బియ్యాన్ని మహారాష్ట్రకు తరలించి అధిక లాభాలు సొమ్ముచేసుకుంటున్నారు. మిల్లర్లపై కఠిన చర్యలు తీసుకోవటానికి ఉన్నతాధికారులు ముందుకు రాకపోవటంతో వీరు ఆడిందే ఆటగా సాగుతోందన్న ఆరోపణలున్నాయి. వీరికి రాజకీయ నాయకులు అండదండలుండటంతోనే కేసులు పెట్టాలంటే భయపడుతున్నట్టు సమాచారం. తాజాగా సిర్పూరు(టి) రైస్‌మిల్లు యాజమాని కూడా విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి ఓ అధికారి లంచం అడిగారని తాను డబ్బులివ్వనందుకే వేధింపులకు గురి చేస్తున్నారని ప్రకటన చేయడం సంచలనం రేకెత్తింది. ఇంత జరుగుతున్నా కూడా ఉన్నతాధికారులు ఎందుకు మౌనంగా ఉంటున్నారన్నది తెలియడం లేదు. అసలు కోట్ల రూపాయలు విలువ చేసే ధాన్యం ఎటుపోయింది..?

ఈ విషయంలో క్షేత్రస్థాయిలో ఉన్నతాధికారులు విచారణ జరుపకపోవటం కూడా అనుమానాలకు తావిస్తోంది. వాస్తవంగా రైస్‌మిల్లుల్లో ధాన్యం స్వాహా అయినప్పుడు క్రిమినల్ కేసులు బుక్ చేయాల్సి ఉండగా, అధికారులు నిమ్మకునీరెత్తినట్టు వ్యవహరించటం దారుణమని పలువురు పేర్కొంటున్నారు. గత ప్రభుత్వంలో ఈ దందా యధేచ్ఛగా కొనసాగినప్పటికీ కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వంలో కూడా ఏమీ మారలేదు. పెట్టుబడి లేకుండా కోట్లకు కోట్లు వెనుకేస్తున్నారు కొంత మంది రైస్‌మిల్లర్లు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి అక్రమాలకు పాల్పడినట్టు తేలిన రైస్‌మిల్లర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేసి బియ్యం రికవరీ చేయాలని అంతా కోరుతున్నారు. ఈ విషయమై డీఎస్‌వో తారామణిని వివరణ కోరగా రైస్‌మిల్లర్లకు ఇచ్చిన గడువు గతనెల 29తో ముగిసినట్టు చెప్పారు. బియ్యం అప్పజెప్పని రైస్ మిల్లర్లపై తగిన చర్యలు తప్పకుండా తీసుకుంటామని తెలిపారు.



కాగజ్‌నగర్‌లోని ఓ రైస్ మిల్లులో తనిఖీలు చేస్తున్న విజిలెన్స్ అధికారులు (ఫైల్)

వార్షిక పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

● ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి

ఆసిఫాబాద్, మార్చి 1: రాష్ట్ర వ్యాప్తంగా ఇంటర్మీడియట్, పదవతరగతి పరీక్షలను ప్రశాంత వాతావరణంలో పకడ్బందీగా నిర్వహించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అన్నారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి డీజీపీ, రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులతో కలసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్‌లు, అదనపు కలెక్టర్‌లు, జిల్లా అధికారులతో వార్షికపరీక్షల నిర్వహణ, ప్రజాపాలన సేవాకేంద్రాల ఏర్పాటుపై సమీక్షాసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ ఫిబ్రవరి28 నుంచి ఈనెల 19వరకు ఇంటర్మీడియట్ పరీక్షలు, ఈనెల18 నుంచి ఏప్రిల్ 2వరకు పదవ తరగతి పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఆయా జిల్లాల పరిధిలో ప్రశాంత వాతావరణంలో పరీక్షలు జరిగేవిధంగా పూర్తిస్థాయి ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. పరీక్షాకేంద్రాలకు సకాలంలో చేరుకునే విధంగా అవసమైన రోడ్లలో బస్సులు నడిపించాలని, మౌలిక సదుపా యాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి లోకేశ్వరరావు, డీఈవో అశోక్, డీఐఈవో శంకర్, విద్యుత్‌శాఖాధికారులు వాసుదేవ్, జిల్లా పరీక్షసహాయ సంచాలకుడు ఉదయ్‌బాబు, జిల్లా పంచాయతీఅధికారి బిక్షపతిగౌడ్, ఏఈ ఫిరోజ్ ఖాన్, జిల్లా పరిషత్ పర్యవేక్షణాధికారి తోటాజీ, తదితరులు పాల్గొన్నారు.



వీసీలో పాల్గొన్న అధికారులు

నేడు దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతి

ఆసిఫాబాద్ రూరల్, మార్చి 1: జిల్లాలో ఈనెల 2న దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి లోకేశ్వరరావు ఒకప్రకటనలో తెలిపారు. ఈనెల2నఉదయం 11గంటలకు జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో జయంతి వేడుకలను నిర్వహిస్తామని, జిల్లా అధికారులు,సిబ్బంది సకాలంలో హాజరు కావాలని కోరారు.

రేపు టీఎన్జీవో సంఘం ఎన్నికలు

ఆసిఫాబాద్ రూరల్, మార్చి 1: సిర్పూర్(టి) మండలంలోని రైతువేదికలో ఈనెల3న టీఎన్జీవో సంఘం యూనిట్ల ఎన్నికలు నిర్వహిస్తామని జిల్లా అధ్యక్షుడు లింగాల రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే 5న ఆసిఫాబాద్ యూనిట్ ఎన్నికలు జన్కాపూర్ రైతు వేదికలో నిర్వహిస్తామన్నారు. 6న జైనూరు యూనిట్ ఎన్నికలు నిర్వహిస్తామన్నారు.

ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలి

ఆసిఫాబాద్, మార్చి 1: ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలని పీడీఎస్‌యూ నాయకులు కోరారు. శుక్రవారం స్థానికంగా వారుమాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగంపై నిర్దిష్టమైన ప్రణాళికను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాలనలో ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్వీర్యం చేసిందన్నారు. కార్పొరేట్ విద్యాసంస్థలకు కొమ్ముకాసిందని, విద్యాసంస్థల్లో కనీస మౌళికసదుపాయాలు కూడా కల్పించలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు విద్యారంగంపై దృష్టిసారించి బలోపేతం చేయాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో తిరుపతి, ప్రణయ్, చిరంజీవి, దివాకర్, కళ్యాణ్, వికాస్, షాహీద్, విలాస్, హరిశ్చంద్ర ప్రసాద్, సునీల్ పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రం తనిఖీ

దహెగాం, మార్చి 1: మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాన్ని శుక్రవారం సిట్టింగ్ స్క్వాడ్ శ్యాంమూర్తి తనిఖీ చేశారు. ప్రథమ సంవత్సరం ఆంగ్ల పరీక్షను 143 విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 8మంది గైర్హాజరు అయినట్లు సీఎస్ అమరేందర్, డీవో అశోక్ తెలిపారు.

6న మండల సర్వసభ్య సమావేశం

సిర్పూర్(టి), మార్చి 1: ఈనెల 6న మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సత్యనారాయణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమావేశానికి ఎంపీటీసీలు, అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

జేఎల్(ఉర్దూ)లో జిల్లా వాసికి మొదటి ర్యాంక్



అవెజ్ ఉల్ రహెమాన్

సిర్పూర్(టి), మార్చి 1: మండల కేంద్రానికి చెందిన పాన్‌షాప్ యజమానికి ఫజుల్ రహెమాన్ కుమారుడు అవేజ్ ఉల్ రహెమాన్ ఉర్దూ మీడియం జూనియర్ లెక్చరర్ ఫలితాల్లో రాష్ట్రంలోనే మొదటిర్యాంకు సాధించడంతోపాటు టీజీటీలో సైతం రాష్ట్రంలో మొదటి ర్యాంకు సాధించాడు. కాగా మారుమూల సిర్పూర్(టి) మండలకేంద్రానికి చెందిన అవేజ్‌ఉల్ రహెమాన్ నిరుపేద కుటుంబంలో జన్మించి ఎంతో కష్టపడి రెండు ఉద్యోగాల్లో రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంకు సాధించాడు. అవేజ్ ఉల్ రహెమాన్ సిర్పూర్(టి) మండల కేంద్రంలోని యూపీఎస్ పాఠశాలలో 1నుంచి 7వ తరగతి వరకు చదువుకోగా 8నుంచి 10వతరగతి వరకు సిర్పూర్(టి) జిల్లాపరిషత్ పాఠశాలలో, కాగజ్‌నగర్ ప్రభుత్వజూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్, కాగజ్‌నగర్ డిగ్రీ ప్రభుత్వ కళాశాలలో డిగ్రీ విద్యను అభ్యసించాడు. అవెజ్ ఉల్ రహెమాన్ ప్రస్తుతం కాగజ్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గెస్ట్ లెక్చరర్‌గా పనిచేస్తుండగా ఆయన సతీమణి కాగజ్ నగర్ పట్టణంలోని జ్యోతిబాఫూలే పాఠశాలలో ఫిజిక్స్ టీచర్‌గా పనిచేస్తున్నారు. అవెజ్ ఉల్ రహెమన్ రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంకు సాధించడంతో మండల వాసులు, కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎస్సీ వర్గీకరణపై మోదీ, మందక్రిష్ణ నాటకాలాడుతున్నారు

● మాల మహానాడు ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు పసుల రాంమూర్తి



సమావేశంలో మాట్లాడుతున్న పసుల రాంమూర్తి

కాగజ్‌నగర్ టౌన్, మార్చి 1: అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఎస్సీ వర్గీకరణ చేస్తామని ప్రగల్భాలు పలికిన ప్రధాని మోదీకి మందక్రిష్ణ మాదిగ వత్తాసు పలికారని వర్గీకరణ అంశంలో ఇద్దరూ నాటకాలు ఆడుతున్నారని మాల మహానాడుఆఫ్‌ఇండియా జాతీయ అధ్యక్షుడు పసుల రాంమూర్తి అన్నారు. శుక్రవారం స్థానికంగా ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణపై ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందక్రిష్ణ మాదిగ, ప్రధానమంత్రి మోదీ నాటకాలను అందరూ వ్యతిరేకించాలన్నారు. వచ్చేపార్లమెంటు ఎన్నికల్లో ఆయా పార్టీలు 3చోట్ల మాలలకే టిక్కెట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిచో పెద్దపల్లి, వరంగల్, నాగర్‌కర్నూల్ 3రిజర్వ్ నియోజకవర్గాల్లో 100మంది అభ్యర్థులను పోటీలో దింపుతామని హెచ్చరించారు. బీజేపీ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ చట్టం తొలగించే కుట్రలు చేస్తుందని ఈకుట్రలను తిప్పి కొడతామన్నారు. వచ్చేఎన్నికల్లో మాలలంతా ఐక్యంగాఉండి హక్కుల సాధనకు నడుం బిగించాలన్నారు. ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా మాలలంతా ఓటు వేసే ముందు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మాల మహానాడు ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షుడు దుంద్ర శ్రీనివాస్, జాతీయ ఉపాధ్యక్షుడు పుల్లయ్య, రాష్ట్ర నాయకులు కాసర్ల యాదగిరి, రాజనర్సు, వెంకటి కుమార్, ఎర్రోళ్ల ఎల్లయ్య, చింతల సత్తయ్య, నాగరాజు పాల్గొన్నారు.

ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు ఘన సన్మానం

రామకృష్ణాపూర్, మార్చి 1: రామకృష్ణాపూర్ ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ ఉషారాణి ఏసీఎంవోగా ప్రమోషన్‌పొందిన సందర్భంగా శుక్రవారం ఆర్కేపీ, మందమర్రి, శ్రీరాంపూర్‌బ్రాంచి బీపీఐసెక్రెటరీలు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆయాబ్రాంచీల సెక్రెటరీలు ముష్కెసమ్మయ్య, ఎస్‌కే బాజీసైదా, కొట్టి కిషన్‌రావు, అక్బర్అలీ, ఇప్పకాయల లింగయ్య, ఆంజనేయులు, సలేంద్ర సత్యనారాయణ, దాగం మల్లేష్, సుదర్శన్, మోతె లచ్చన్న, నాగేంద్ర, శ్రీనివాస్, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఉపాధి కోసమే స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్

మందమర్రిటౌన్, మార్చి 1: సింగరేణి పరిసర ప్రాంతాల్లోని నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని మందమర్రిలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేశామని ఎస్‌వోటూ జీఎం రాజేశ్వర్‌రెడ్డి తెలిపారు. కొన్నిరోజులుగా సెంటర్‌లో డ్రోన్, సోలార్ శిక్షణ పొందుతున్న వారికి శుక్రవారం సర్టిఫికెట్లు అందజేశారు. ఆయన మాట్లాడుతూ అనుభవంగల శిక్షకులచేత శిక్షణ ఇప్పిస్తున్నామన్నారు. షార్ట్, లాంగ్ టర్మ్ కోచింగ్ అందించనున్నట్లు తెలిపారు. నిరుద్యోగులు పట్టుదలతో శిక్షణను తీసుకుని స్వయంఉపాధి,ఉద్యోగాలుసాధించాలని ఆయనపేర్కొన్నారు. కార్యక్రమంలో అధికారుల సంఘం అధ్యక్షుడు రమేష్, ఏఎస్‌వో రవీందర్, పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, సెంటర్ ఇన్‌చార్జి మేనేజర్ శంకర్, ట్రైనింగ్ మేనేజర్ అశోక్, సోలార్ ట్రైనింగ్ ప్యాకల్టీ జయంత్ పాల్, టెక్నీషియన్ సందీప్ తదితరులు పాల్గొన్నారు.



సర్టిఫికెట్లు తీసుకున్న అభ్యర్థులతో ఎస్‌వోటూ జీఎం రాజేశ్వర్‌రెడ్డి

రోజుకు 2.35 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి, రవాణా చేయాలి

● సీఎండీ బలరాం



మాట్లాడుతున్న సీఎండీ బలరాం

శ్రీరాంపూర్, మార్చి 1: ఈ ఆర్థిక సంవత్సరం చివరినెల అయిన మార్చిలో రోజుకు కనీసం 2.35 లక్షల టన్నుల బొగ్గుఉత్పత్తి అదే పరిమాణంలో బొగ్గు రవాణా జరపాలని తద్వారా ఈ మాసాంతానికి 700 లక్షల టన్నుల వార్షికలక్ష్యాన్ని అధిగమించాలని సంస్థ ఛైర్మన్, ఎండీ బలరాం సూచించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో సంస్థ డైరెక్టర్‌లు, జీఎంలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది నిర్దేశించుకున్న 700లక్షల టన్నుల ఉత్పత్తి లక్ష్యం, రవాణా సాధించడానికి ప్రతి ఏరియా జీఎం తన కింది అధికారులతో ఓవర్ బర్డెన్ యాజమానులతో సమీక్షిస్తూ సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. మొత్తం 12 ఏరియాల్లో మణుగూరు, కొత్తగూడెం, ఇల్లెందు, బెల్లంపల్లి ఏరియాలు లక్ష్యాలు అధిగమించి ముందుకుపోవడంపై ఆయన అభినందించారు. ఇతర ఏరియాలు కూడా వార్షిక లక్ష్యాన్ని అధిగమించేందుకు కృషి చేయాలన్నారు. సమావేశంలో అధికారులు సత్యనారాయణరావు, శ్రీనివాస్, వెంకటేశ్వర్‌రెడ్డి, అల్విన్, దేవేందర్, సాయిబాబు, సూర్యనారాయణరాజు, నవీన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల ఆకాంక్షలను నెరవేరుస్తాం

మందమర్రిటౌన్, మార్చి 1: సింగరేణి కార్మికుల ఆకాంక్షలను నెరవేరుస్తామని గుర్తింపు సంఘం బ్రాంచ్‌కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ, భీమనాథుని సుదర్శన్, కంది శ్రీనివాస్ పేర్కొన్నారు. శుక్రవారం ఏరియాలోని కేకే5గనిపై కార్మికులను కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వారు మాట్లాడుతూ ఎంతో నమ్మకంతో కార్మికులు తమను గుర్తింపుసంఘంగా ఎన్నుకున్నారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేరుస్తామన్నారు. వార్షిక ఉత్పత్తి లక్ష్య సాధనకు నెల రోజులు మాత్రమే సమయం ఉన్నందున నాణ్యమైనపనిముట్లు సరఫరా చేయాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో గాండ్ల సంపత్, మేకల సంతు, ప్రేమ్‌లాల్, సంపత్, శ్రీనివాస్,రాంబాబు పాల్గొన్నారు.

లక్ష్యాన్ని సాధించిన ఆర్కే6 గని

శ్రీరాంపూర్, మార్చి 1: శ్రీరాంపూర్‌లోని ఆర్కే6 గని నిర్దేశిత బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని 30రోజుల ముందుగానే సాధించింది. ఈ నేపథ్యంలో ఉద్యోగులకు శుక్రవారం గనిపై మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా జీఎం బి సంజీవరెడ్డి మాట్లాడుతూ, ఆర్కే6 గని ప్రతి అంశంలోనూ రికార్డులు సాధిస్తోందని, ఇదే పంథాను కొనసాగించాలని సూచించారు. గని ఉత్పత్తి లక్ష్యం లక్ష80 వేల టన్నులు కాగా, శుక్రవారం నాటికి ఆ ఉత్పత్తిని సాధించడం అభినందనీయమన్నారు. గ్రూప్ ఏజెంట్ ఎ వెంకటేశ్వర్ రెడ్డి, మేనేజర్ ఈ తిరుపతి ఉద్యోగులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో గుర్తింపు సంఘం నాయకులు సంగం సదానందం, తదితరులు పాల్గొన్నారు.